నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

బుధవారం | డిసెంబర్ 13, 2023 | www.navatelangana.com

కొత్త సంవత్సరం నుంచి పెద్దవాగు నీటి సరఫరా

నవతెలంగాణ - కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణ ప్రజలకు కొత్త సంవత్సరం నుంచి పెద్దవాగు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ అధికారులను ఆదేశించారు. పెద్దవాగు వద్ద గల ఇంటెక్‌వెల్, ఇన్ఫిల్ట్రేషన్ వెల్ పనులను మంగళవారం మున్సిపల్ అధికారులు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో పెద్ద వాగు నీళ్లను సరఫరా చేయడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ డిఈ, పబ్లిక్ హెల్త్ ఏఈ, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఖానాపూర్ ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మంగళవారం మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని వారి స్వగృహంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదివాసీ గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. సన్మాన కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు యుర్వేత రూప్‌దేవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, జిల్లా సార్మెడి దుర్గు పటేల్, జామడ సర్పంచ్ రూప్‌దేవ్, గోవింద్, రాహుల్ ఉపసర్పంచ్ విష్ణు ఉన్నారు.



పులి దాడిలో పశువుల కాపరికి గాయాలు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలో మరోసారి పులి అలజడి రేపింది. కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని అంకుసాపూర్ అటవీ ప్రాంతంలోని భీమదేవర జెండాల సమీపంలో మేతకు వెళ్లిన పశువుల మందపై మంగళవారం పెద్ద పులి దాడి చేసింది. ఈ ఘటనలో ఓ పశువును హతమార్చింది. మండలంలోని వంజీరి గ్రామానికి చెందిన పశువుల కాపరి అల్లూరి గులాబ్‌దాస్(42) పెద్దపులిని వారించేందుకు ప్రయత్నించాడు. దీంతో పులి ఎదురుదాడి చేసి గాయపర్చింది. పశువుల కాపరి కేకలు వేయడంతో పులి పారిపోయింది. ఈ ఘటనలో పశువుల కాపరి అల్లూరి గులాబ్‌దాస్ పొట్టపై, చేతికి గాయాలు కావడంతో కాగజ్‌నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఆరోగ్య పరిస్థితిని ఎఫ్‌డీఓ వేణు, ఎఫ్ఆర్ఓ వేణుగోపాల్, సిబ్బంది తెలుసుకున్నారు.

నిరుపేదల సేవలోనే నిజమైన సంతృప్తి

- కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్



నవతెలంగాణ - కాగజ్‌నగర్‌రూరల్

నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గిరిజన గ్రామం ఉట్పల్లిలో కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతి ఇంటికీ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ తల్లి, తండ్రి పేరు మీద సొసైటీ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చలి తీవ్రత పెరిగిన దృష్ట్యా గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అదేవిదంగా కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటి ద్వారా ఉచిత కంటి ఆపరేషన్లు, కుట్టుమిషన్లు, మెడికల్ క్యాంపులు వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వలపదాసు రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి గౌత్రే వెంకటేశ్, గ్రామ సర్పంచ్ అత్రం రాంషా, పెద్దలు మడేవి బాబూరావు, అర్జు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలి



నవతెలంగాణ-తాండూర్

పోస్టల్ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని తాండూరు సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని రేచిని, మాదారం, తాండూర్ బిపిఎంలు, జిడిఎస్‌లు సమ్మెకు దిగారు. మంగళవారం తాండూర్ సబ్ పోస్ట్ ఆఫీస్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగులకు 8గంటల పనితో పాటు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని తెలిపారు. రూ.50వేల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, జిడియస్, గ్రాట్యూటీ పెంచాలని, పెయిడ్ లీవ్‌లను 160 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకొనే సౌకర్యం కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం అనే సూత్రం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు అబ్దుల్ హుక్, బిపిఎంలు పెద్దన్న, హైమద్, అంజి, మసాడి గోపాల్ పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

నవతెలంగాణ-ముథోల్

నియోజకవర్గ కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ రఫీయొద్దిన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ప్రిన్సిపాల్ తమను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆరోపిస్తు ఇటీవల పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. పత్రికల్లో వార్తలు రావటంతో ప్రిన్సిపాల్‌ను సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా అమృత మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

సీఐటీయూతో కలిసొస్తున్న కార్మికులు

- ఎస్‌కేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు సమీపిస్తున్న వేళ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)తో కలిసి రావడానికి కార్మికులు ముందడుగు వేస్తున్నారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఇందారం 1ఏ గనిపై బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా సీఐటీయూ చేస్తున్న పోరాటాలను గుర్తు చేసుకున్న కార్మికులు ఈసారి ఓటు వేసి గెలిపించడానికి సిద్ధమవుతున్నారని, దానికి నిదర్శనంగా ఈరోజు 50 మంది యూనియన్‌లో చేరడమేనని అన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా కొన్ని సంవత్సరాలుగా గనులపై సమస్యలే కాకుండా స్థానికంగా కార్మిక వాడల్లో గల మంచినీరు, పారిశుధ్య వ్యవస్థ వంటి సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. గెలిచిన సంఘాలు సాధించలేని సీఎంపిఎఫ్‌పై వడ్డీ రేటు ఇప్పించడం, డీఏ ఆలస్యంగా చెల్లిస్తే ఒత్తిడి తెచ్చి ఇప్పించడం, ఆసుపత్రులలో నాణ్యమైన మందులు, మెరుగైన వైద్య సేవల కోసం పోరాటం చేస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గోదావరి పక్కనున్నా కనీసం కార్మిక వాడలకు శుభ్రమైన మంచినీరు ఇప్పించని ప్రభుత్వ అనుబంధ సంఘాలు ఐఎన్టియూసిలో చేరుతున్నారని, వారు మళ్లీ యధాతథంగా కార్మికులను మోసం చేయడానికి వస్తున్నందున ప్రభుత్వ యూనియన్లతో కార్మికులకు ఒరిగేదేమీలేదని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఏవైనా కార్మికుల వ్యతిరేకులేనని, ముఖ్యమంత్రి రూ.10లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తానని బహిరంగంగా ప్రగతిభవన్‌లో చెప్పి లేనిపోని కొర్రీలు పెట్టి చివరకు ఆ వడ్డీ కూడా మనం కట్టినంత ఇప్పించలేని స్థితికి వచ్చిందన్నారు. ఏఐటీయూసీ గెలిచిన ఏరియాలో ఒక విధంగా మిగిలిన ఏరియాల్లో ఒక విధంగా ప్రవర్తిస్తున్న తీరును కార్మికులు గమనించాలని, వారు గెలిచి ఉన్న మందమర్రిలో ఎందుకు ఇంటి కిరాయి ఇప్పించలేకపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. క్వార్టర్ల పైరవీలను ఎంత మేర అరికట్టారో చూపాలని, భూపాలపల్లి ఏరియాలో 40 మందికిపైగా కార్మికులు డిస్మిస్ అయిన వారిపై ఏ పోరాటం చేశారో చెప్పాలని అన్నారు. కార్మికులపై ఎంత ఒత్తిడి పెరుగుతున్నా కనీసం నాయకులకు చెప్పుకోలేని స్థితికి తెచ్చిన ఇలాంటి సంఘాలను ఓడించాలని, ప్రతి సమస్యపై నీతి, నిజాయితీగా ఎలాంటి పైరవీలు లేకుండా పోరాడుతున్న సీఐటీయూ ఉదయించే సూర్యుడు ఈసారి సింగరేణిలో ఉదయించనున్నాడని పేర్కొన్నారు. సీఐటీయూ 12గ్యారెంటీలతో ముందుకు వెళుతుందని, దానికి ఆకర్షితులై కార్మికులు యూనియన్‌లోకి చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, వైస్ ప్రెసిడెంట్ కస్తూరి చంద్రశేఖర్, ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్, నాయకులు సుధాకర్, సాయిల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల కిషన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కార్మికుల సమస్యల సత్వర పరిష్కారానికి తగిన ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు కోరారు. సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు రాజేందర్ అధ్యక్షతన మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాములు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రమాణ స్వీకారం రోజు మాట్లాడుతూ మేము పాలకులం కాదు సేవకులం అని అన్నారని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన కార్మికుల సమస్యలతో పాటు వివిధ కార్మిక సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే సమస్యలను కూడా సత్వరం పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో కార్మికవర్గం ఉత్పాదకతను పెంచడంలోనూ, వివిధ సేవా రంగాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎంతగానో శ్రమించి చేసిన కృషి తెలిసిందే అన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ జీఓలను సవరించడం, విడుదలైన 5 జీఓలకు గెజిట్ జారీ చేయడం, కనీస వేతనం రూ.26,000 అమలు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వివిధ శాఖలు, సంస్థల్లో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయడం, సమాన పనికి సమాన వేతనం అమలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన 2వ పీఆర్సీని వెంటనే ఖరారు చేయడం, సామాజిక భద్రత చట్టాలను అమలు చేయడం, స్థానిక సంస్థల్లో పనిచేసే గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచడం, ఉద్యోగ భద్రత కల్పించడం, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయడం లాంటి ప్రధాన సమస్యలను రాష్ట్ర కార్మికవర్గం ఎదుర్కొంటోందని తెలిపారు. తమ పోరాటాలకు సంఘీభావం తెలిపి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అందుకు అనుగుణంగా కార్మిక సంఘాలతో నూతన ముఖ్యమంత్రి సమావేశమై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు ఆర్ త్రివేణి, శ్రీకాంత్, కార్యదర్శిలు పద్మ, శంకర్, నాయకులు మోరేశ్వర్, నగేష్, సంజీవ్, ప్రభాకర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

పార్టీని వీడి విమర్శలు చేయడం సరికాదు

నవతెలంగాణ -ఆదిలాబాద్‌అర్బన్

సొంత లాభం కోసం తల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని వీడి ఆపై పార్టీపైనే విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి గంగారెడ్డి విమర్శించారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన బాలూరి గోవర్ధన్‌రెడ్డి పార్టీపై చేసిన ఆరోపణలను ఖండించారు. తల్లి లాంటి పార్టీని అవమానించేలా మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తామన్నారు. ఎన్నికలకు నెల రోజుల ముందు పార్టీ మారిన నాయకులు బీఆర్ఎస్‌పై అనవసర దుష్ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సబబు కాదని పేర్కొన్నారు. ఎయిర్ ఫోర్స్ స్టేషన్ మంజూరు కోసం గత ప్రభుత్వం విశేష కృషి చేసిందని, ప్రభుత్వ ధనంతోనే సర్వేలు సైతం నిర్వహించినట్లు తెలిపారు. మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో కొనసాగిన కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి డబ్బులకు అమ్ముడు పోయి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సొంత లాభం కోసం పార్టీలు మారిన నాయకులు బీఆర్ఎస్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదిలాబాద్ అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని



ఆక్షేపించారు. అనవసర విమర్శలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు శివకుమార్, ధమ్మపాల్, అజయ్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో భారీ చేరికలు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5బి, 6 గని కార్మికులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవి రావు సమక్షంలో దాదాపు 250కి పైగా కార్మికులు యూనియన్‌లో చేరారు. గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా గనులపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగి, కార్మికవర్గ హక్కులు, సౌకర్యాలే ధ్యేయంగా పనిచేస్తున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను కార్మికులు ఆదరించి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. నిర్మాణలేమితో ఉన్నటువంటి సింగరేణిలోని మిగతా జాతీయ, ప్రాంతీయ సంఘాలు బలమైన కార్మిక ఉద్యమాలను నిర్మించలేవన్నారు. ఉద్యోగి ఇలాంటి సంఘాలను నమ్మి ఓట్లు వేస్తే కార్మికుల ఐక్యతకు భంగం కలుగుతుందన్నారు. ఇది కార్మికులకు పరీక్షా సమయమని, విజ్ఞులైన సింగరేణి ఉద్యోగులు బాగా ఆలోచించి విచ్ఛిన్నకర పాత్ర పోషిస్తున్న ట్రేడ్ యూనియన్లను చిత్తుగా ఓడించాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కొన్ని డిమాండ్లను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కె వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, నాయకులు షేక్ బాజీ సైదా, మోతుకూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, మారేపల్లి బాపు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడి.. పథకంపై ఆరా తీసి

- బస్టాండ్‌ను సందర్శించిన కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్, బోథ్ ఆర్టీసీ బస్టాండ్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలు, ప్రయాణ సౌకర్యాలను బస్‌లలో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా ప్రయాణికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణం కొనసాగించేలా వారికి సహకరించాలని కండక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థినిలకు, మండల, జిల్లా కేంద్రాలకు బస్‌లలో ఉచిత ప్రయాణం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 81వేల మంది మహిళా ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. మహిళలందరూ మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రవీణ్, డిపో మేనేజర్ కల్పన, అధికారులు విశ్వనాథ్, శ్రీకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దిగుబడులను అంచనా వేసేందుకే పంట కోత ప్రయోగాలు

- మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్



నవతెలంగాణ-దండేపల్లి

దిగుబడులను అంచనా వేసేందుకు పంటకోత ప్రయోగాలను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో పంటకోత ప్రయోగాలను పరిశీలించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎంపిక చేసిన గ్రామాలలో పంటకోతల ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేయబడిన భూములలో ఐదు మీటర్ల స్థలంలో కోత ద్వారా ప్రయోగం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలా ఎంపిక చేసిన గ్రామాలలో పంటలను కోసి దిగుబడిని అక్కడే డిజిటల్ మిషన్ ద్వారా లెక్కించి ఆన్‌లైన్‌లో రిపోర్ట్ పొందుపరుస్తామని తెలిపారు. ఇలా అన్ని జిల్లాల నుండి సేకరించిన సగటు దిగుబడిని రాష్ట్రస్థాయిలో అంచనా వేయడానికి ఉపయోగపడుతుందన్నారు. తద్వారా పంటకు సంబంధించిన దిగుబడుల సాయంతో భవిష్యత్ ప్రణాళికలు రూపొందించేందుకు వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక, వ్యవసాయ అధికారి కల్పన, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజేందర్, మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్, మండల ప్లానింగ్ అధికారి సుమన్, ఎంపిటిసి శ్రీనివాస్ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన జీఎం



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల శాసనసభ్యులు ప్రేంసాగర్‌రావును శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ ఎం శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ వి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | డిసెంబర్ 13, 2023 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన వేల్పుల గంగన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మంగళవారం విషయం తెలుసుకున్న మానవసేవే మాధవసేవ గ్రూప్ ఫౌండర్ శేట్‌పెల్లి మహేందర్ గ్రూప్ సభ్యులచే బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యువసేన యూత్ అధ్యక్షులు కుమ్మరి రమేష్, రెంకల శీను, అల్లంల పవన్, కొప్పుల రమేష్, మల్క మధు, సిరివేని అంజన్న, అల్లంల భూమేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన టీజీఓ సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన పాయల శంకర్‌ను తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నిర్వహించే అభివృద్ధి పనుల్లో తమవంతు పాత్ర నిర్వహిస్తామని పేర్కొన్నారు. టీజీఓల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు.



బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని లోహర గ్రామసర్పంచ్ సోము తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అంకోలి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మాధస్తు పోశెట్టి తండ్రి రాజారెడ్డి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలిసిన మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం అంకోలి గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన శకుంతల కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ధైర్యాన్ని చెప్పారు. పరామర్శించినవారిలో ఎంపీపీ గండ్రత్ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మెన్ కుమ్ర రాజు, రమణ, సుదర్శన్, భూమన్న, గంగయ్య యాదవ్, జగదీష్ యాదవ్ పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని భరంపూర్ గ్రామంలో పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..భరంపూర్ గ్రామానికి చెందిన రైతు సంపతి శంకర్(44) ఎప్పటిలాగా ఆదివారం చేను పనులకు వెళ్లగా పాము కాటు వేసింది. వెంటనే రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. కాగా రైతు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలి

- జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్

నవతెలంగాణ-నార్నూర్

చెడు వ్యసనాలకు దూరంగా ఉండి అధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నిర్వహించిన అఖండ హరినామ సప్తాహ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. శ్రీహరి భక్త పారాయణ్ భాస్కర్ మహారాజ్ భజన కీర్తనలను ఆలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యాసనాల బారిన పడకుండా ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతోనే మనస్సుకు ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, సర్పంచ్ రాథోడ్ మదుకర్, ఉపసర్పంచ్ విష్ణు, మౌలి మహారాజ్, పాండురంగ్ మాహారాజ్, ఆలయ కమిటీ సభ్యులు కోటగిరి విశాల్, సత్యనారాయణ, రాము పటేల్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-తాంసి

ప్రభుత్వ గిరిజన అశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో మంత్రి కొండా సురేఖకు సీఆర్టీల రాష్ట్ర కమిటీ అధ్యక్షులు జాదవ్ వసంత్‌రావ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ కాంట్రాక్ రెసిడెన్సియల్ ఉపాధ్యాయులు గత ఇరవై సంవత్సరాలుగా విధులు నిర్విస్తున్నామని అన్నారు. కానీ ఉద్యోగ భద్రత మినిమం టైంస్కేల్, దశల వారీగా సర్వీస్ క్రమబద్దీకరణ చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోడం శ్రీనివాస్, రాష్ట్ర సభ్యులు పెద్ది శ్రీనివాస్, గోపాల్, మంగీలాల్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరడం గర్వంగా భావించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం గర్వంగా భావించాలని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వికాస్ శర్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో ఎన్‌సీసీ 32 బెటాలియన్ ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. పది రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని తొలి రోజు మంగళవారం ఆయన పాల్గొని ప్రారంభించారు. ముందుగా క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్యాడెట్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమాండింగ్ అధికారి కల్నల్ వికాస్ శర్మ మాట్లాడుతూ దేశ సేవలో భాగం కావడానికి ఎన్‌సీసీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఇందులో చేరడం పట్ల విద్యార్థులు గర్వంగా భావించాలన్నారు. పది రోజుల శిక్షణలో ఆర్మీలో ఇచ్చే శిక్షనాలుంటాయన్నారు. కష్టపడితే ఆర్మీలో చేరడం సులవుతుందన్నారు. శత్రువులను చంపడమే కాదు. వారి దాడుల నుంచి ఎలా తప్పించుకోవాలో అది కూడా నేర్చుకోవాలన్నారు. ఆ దిశగా క్యాడెట్లను సిద్ధం చేయడానికి పది రోజుల శిక్షణ శిబిరాలు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ జగ్ రాం, కెప్టెన్ అశోక్, కెప్టెన్ ఐలయ్య, ఎస్ఓ పూర్ణచందర్, నాగశ్రావణి, వందన, మధురావ్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-తలమడుగు

బోథ్ నియోజకవర్గాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం లింగి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో విడతల వారీగా అభివృద్ధిపరుచుకుందామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల అన్నదమ్ముల వలె కలిసిమెలిసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. రోడ్లు చెరువులు, విద్య వైద్యం అందరికీ అందే విధంగా ప్రజల సహకారంతో ముందుకు తీసుకెళ్తానన్నారు. నియోజకవర్గ సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే ప్రజలు నేరుగా ముందుకు వచ్చి విన్నవించాలని కోరారు. అంతరం తిరుమల స్టోన్ క్రషర్ వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంజీవ్‌రెడ్డి, తోట వెంకటేష్, కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచులు కళ్లెం కరుణాకర్ రెడ్డి, గెల్ల మహేందర్ యాదవ్, ఎంపీటీసీ చంటి, అభిరామ్‌రెడ్డి, లింగారెడ్డి, పల్లవి స్టోన్ క్రషర్ యాజమాన్యం ప్రవీణ్, నవీన్, సుమన్ వివిధ మండలాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.

వర్కర్స్ మేనిఫెస్టోని అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా సీఐటీయూ వర్కర్స్ మేనిఫెస్టోను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికైన ఎమ్మెల్యేలు అందరికి సీఐటీయూ జిల్లా కమిటీ తరపున ముందుగా అభినందనలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కార్మికవర్గం ఉద్యోగులు అనేక ఆకాంక్షలతో ఆశలతో రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశారని అన్నారు. కనీస వేతనాలు అమలు అవుతాయని సర్వహక్కులు అందుతాయని ఆశించారు. కాని నాడు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల, ఉద్యోగుల ఆకాంక్షలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. కార్మికులు, ఉద్యోగులు హక్కులకు దూరంగానే ఉన్న పరిస్థితి నెలకొన్న సందర్భంలో అనేక పోరాటాలు, స్కీమ్ వర్కర్ల సమ్మెలు, ఉద్యోగుల సమ్మెలు జరిగాయని అన్నారు. ఈ నేపథ్యంలోనే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర కార్మిక వర్గం ప్రజలు కాంగ్రెస్‌కి అధికారాన్ని అప్పజెప్పారని అన్నారు. ఎన్నికల కంటే ముందుగానే రాష్ట్ర కార్మికవర్గం ఆశలను ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా వారి డిమాండ్లను వర్కర్స్ మేనిఫెస్టో రూపంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ అన్ని రాజకీయ పార్టీల నాయకత్వాలను కలిసి వర్కర్స్ మేనిఫెస్టో ప్రతులను అందించిందని అన్నారు. కాంగ్రెస్ అధికారాన్ని సద్వినియోగం చేసుకుంటూ వర్కర్స్ మేనిఫెస్టోని అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ లాంటి స్కీమ్ వర్కర్ల అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అన్ని హక్కులు కల్పించాలన్నారు. 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులందరికీ నూతన కనీస వేతన సవరణ జీఓలను విడుదల చేయాలన్నారు. హమాలి, కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను ఆదుకునేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పర్మినెంట్ చేయాలని అన్నారు. తదితర తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ కార్మికుల ఆకాంక్షలు నెరవేరేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు సోమన్న, జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, డి వెంకటమ్మ, ఎం.గంగన్న, సహాయ కార్యదర్శి పి.జితేందర్, ఎస్.శోభ, ఎం.సుజాత, ఎస్.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

- క్వింటాల్‌కు రూ. వెయ్యి బోనస్ ప్రకటించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అధిక వర్షాలతో జిల్లాలో పత్తిపంట, కంది రైతులు తీవ్రంగా నష్ట పోయారని పత్తికి మైచర్ 20శాతం మినహాయింపు ఇస్తూ రూ.వెయ్యి బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్త్రాతి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తూ, ఇప్పటి వరకు కొన్న వాటికీ కూడా రూ.వెయ్యి బోనస్ ఇచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేయక పోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులపై ఆధారపడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రైతు క్వింటాలుకు రూ .600 నష్ట పోతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన సీసీఐ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసే విధంగా జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి స్వామి, నాయకులు శంకర్, సంతోష్, ఆశన్న పాల్గొన్నారు.

పోస్టాఫీస్ ఎదుట గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సమ్మె

- సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె యథాతథం



సమ్మెలో పాల్గొన్న పోస్టల్ ఉద్యోగులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని దశాలవారీగా ఆందోళన చేపట్టిన తపాల శాఖ, ప్రభుత్వం పట్టించుకోలేదని, హక్కుల సాధన కోసం దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా నిరవధిక సమ్మె చేపట్టామని గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆదిలాబాద్ డివిజన్ కన్వీనర్ జాదవ్ కిరణ్ అన్నారు. జీడీఎస్, పీజేసీఏ పిలుపు మేరకు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రధాన పోస్టాఫీసు ఎదుట దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్ ఆదిలాబాద్ డివిజన్ కన్వీనర్ జాదవ్ కిరణ్ మాట్లాడుతూ ఎనిమిది గంటల పని కల్పించి పని భారం తగ్గించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. సెలవులను పే లీవులుగా మార్చుకునే అవకాశం కల్పించాలన్నారు. తమ సమస్యలపై రెండు సంవత్సరాలుగా ఉద్యమిస్తున్న తపాల శాఖ, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా నిరవధిక సమ్మె చేపట్టినట్టు వివరించారు. సమస్యను పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సమ్మెలో చైర్మెన్ గట్టు శ్రీనివాస్, జీడీఎస్పీ కైలాస్‌గౌడ్, మహేష్, దశరథ్, గంగన్న, శ్రీకాంత్, రమేష్, సుశీల ఉన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



పర్యటనలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటి సారిగా ఖానాపూర్‌కు వచ్చారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు భారీగా వచ్చి ర్యాలీని నిర్వహించారు. ఇందిరమ్మ, కుమురం భీం, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలు సంఘాల నాయకులు, జర్నలిస్టులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో పేరుకుపోయిన అన్ని సమస్యలను పరిష్కారం దిశగా తాను కృషి చేస్తానన్నారు. కడెం ప్రాజెక్టు గేట్ల సమస్యపై సంబంధిత అధికారుల నివేదికలు తీసుకొని ప్రాజెక్టు సమస్యలను శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడెం ఎంపీపీ ఆంటోని అలెగ్జాండర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, యువజన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారిశంకర్, కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు వాజిద్‌ఖాన్, మైనార్టీ అధ్యక్షులు బబ్లు, రహీం, ముఖ్య నాయకులు కుమ్మరి రమేష్, జాడి ఇందూర్, పడిగెల భూషణ్, ఇస్రు, రాజు, ధర్మయ్య, కమలాకర్, బ్రహ్మచారి, రేంకల శ్రీను పాల్గొన్నారు.

సైన్స్ కోర్సుతో భవితకు ఉపయోగం

నవతెలంగాణ-తాంసి

సైన్స్ ఒకేషనల్ కోర్స్ చదువుతున్న విద్యార్థులు శ్రద్ధతో చదువుకొవాలని అది భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ సైన్స్ కోర్స్ ప్రాక్టికల్ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాక్టికల్ చేస్తున్న విద్యార్థులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్మీడియట్‌తో సమానమైన ఒకేషనల్ సైన్స్ కోర్స్ చదువుతున్న విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో కోర్సును ప్రాక్టికల్స్ ఆన్ జాబ్ ట్రైనింగ్ పూర్తి చేసుకుంటే రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.



ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిగేలా ప్రోత్సహించాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిగెలా ప్రోత్సహించాలని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రాంబాబు సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు వంద శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగెలా చూడాలన్నారు. తమకు అనుబంధమైన గ్రామాల్లో గర్భిణీ స్త్రీలకు, చిన్నారులకు అందిస్తున్న టీకాల వివరాలను సేకరించారు. గర్భిణీలను గుర్తించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వారు చేపట్టే విధివిధానాలను వివరించారు. సమావేశంలో హెచ్ఈఓ నాందేవ్, హెచ్ఓ లక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు చరణ్‌దాస్, సతవ్వా, వైద్య సిబ్బంది హిమబిందు, అదిప్, దినేష్ ఉన్నారు.

బస్టాండ్‌లో లేడీస్ కార్నర్ ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు విశ్రాంతి తీసుకునేలా ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో లేడీస్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. ఇది వరకే ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ఆర్టీసీ అదికారులు సైతం మహిళాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు మహిళలు వేచి ఉండేందుకు ప్రత్యేకంగా మహిళ కార్నర్ ఏర్పాటు చేశారు. అదే విధంగా చిన్న పిల్లల తల్లుల కోసం మదర్ ఫిడింగ్ క్యాబిన్ కూడా సిద్ధం చేశారు. అధికారులు సౌకర్యాలపై పలువురు ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం కల్పన మాట్లాడుతూ ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా బస్టాండ్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే మహిళాలు వేచి ఉండానికి లెడీస్ కార్నర్ ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా మదర్ ఫిడింగ్ రూమ్ కూడా ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడబ్ల్యూసీ హమాలీలు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఏఐటీయూసీలోకి ఆహ్వానించారు. అనంతరం సీడబ్ల్యూసీ హమాలీ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ కార్మికులకు సంక్షేమ బోర్డుతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు హమాలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం హమాలీలకు అండగా ఉంటూ ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దేవేందర్, కుంటాల రాములు, నూతన కార్యదర్శి సీహెచ్ చౌహన్, ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం, అమృత్, బండు, సాంబాజీ, అబ్రార్, ప్రమోద్ ఉన్నారు.

ఆర్టీసీలో మహిళలకు ఇబ్బందులు లేకుండా ప్రయాణ ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం కొనసాగించేందుకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో ప్రయాణిస్తున్న మహిళల ప్రయాణ సౌకర్యాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, మహిళా ప్రయాణికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణం కొనసాగించుటకు వారికి సహకరించాలని ఆర్టీసీ డీఎం ప్రతిమరెడ్డిని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ధర్మసాగర్, వైకుంఠ ధామం, సిర్గాపూర్‌లోని నర్సరీ, ఫిల్టర్ బెడ్, బంగల్‌పేట్‌లో పారిశుధ్య వనరుల ఉద్యానవనం పరిశీలించారు. ధర్మసాగర్ చెరువు దగ్గర నిర్మించే సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ స్థలాన్ని, బైల్ బజార్ దగ్గర నిర్మిస్తున్న శ్మశాన వాటిక పనులను పరిశీలించారు. సిద్దాపూర్‌లో నిర్వహిస్తున్న నర్సరీ, వాటర్ హెడ్ వర్క్‌లను పరిశీలించారు. అనంతరం ఎఫ్ఎస్‌టీఎఫ్ మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి డంపింగ్ యార్డ్ నందు త్వరగతిన బయో మైనింగ్ పనులను చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమీషనర్ సీవీఎస్ రాజు, డీఈ సంతోష్, ఏఈలు వినయ్, హరిభువన్, టీపీఓ సుమలత, శానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల

నవతెలంగాణ-నిర్మల్



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో పరామర్శించారు. డాక్టర్‌ను ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బీజేపీలో చేరిన హనుమాన్‌తండా ఎంపీటీసీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని హనుమాన్ తండా ఎంపీటీసీ రాథోడ్ రాజు మంగళవారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంలో రాజు మాట్లాడుతూ ప్రాదేశిక నియోజకవర్గం అభివృద్ధికోసం బీజేపీలో చేరినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కరిపే విలాస్, సీనియర్ నాయకులు వడ్డి రాజేందర్‌రెడ్డి, కోరిపెల్లి రాజేశ్వర్‌రెడ్డి, కరుణసాగర్ రెడ్డి, తిరుమలచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలి

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలో ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు, ఓనర్లు మంగళవారం కడెం ప్రధాన రహదారిపై బైఠాయించి, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు, ఓనర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి వాహనాలు కొనుగోలు చేసి ఈఎంఐలు కట్టుకుంటూ తమ వాహనాలు నడుపుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటే ఒక్కసారిగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో తమ బతుకులు ఆగమయ్యాయని మండిపడుతున్నారు. వెంటనే మహాలక్ష్మి పథకాన్ని ఎత్తివేసి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కి వినతిపత్రం అందజేసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆటో, టాటా మ్యాజిక్ జీపు డ్రైవర్లు ఓనర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

బుధవారం | డిసెంబర్ 13, 2023 | www.navatelangana.com

ట్రస్మా ప్రధాన కార్యదర్శిగా తిరుపతి ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రస్మా) జిల్లా ప్రధాన కార్యదర్శిగా వోల్వోజు తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా ఎన్నికల అధికారిగా పెద్దపల్లి కిషన్ రావ్ వ్యవహరించగా అధ్యక్ష పదవికి పి.దేవభూషణం, ఎండి.తాజుద్దీన్‌లు పోటీలో ఉన్నారని కోశాధికారిగా దీకొండ సంజీవ్ కుమార్, అలుగొట్టు తిరుపతిలు పోటీలో ఉన్నారని తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా వోల్వోజు తిరుపతి ఒక్కడే నామినేషన్ దాఖలు కావడంతో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌లు, మంచిర్యాల ట్రస్మా అధ్యక్షుడు విష్ణువర్ధన్ లు హాజరువుతారని తెలిపారు. ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తిరుపతిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మాజీ అసోసియేట్ అధ్యక్షుడు చిలుకూరి రాధాకృష్ణ చారి పాల్గొన్నారు.

హమాలీల హక్కుల కోసం నిరంతర పోరాటం

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హమాలీ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని, హక్కుల సాధన తమతోనే సాధ్యమవుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రానికి చెందిన దాదాపు 30 మంది హమాలీ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికుల హక్కుల సాధన తమ సంఘంతోనే సాధ్యమవుతుందన్నారు. తాము చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై హమాలి కార్మికులు తమ సంఘంలో చేరడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం ఏఐటీయూసీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఏఐటీయూసీలో చేరిన వారిలో కార్మికులు ఎం.సుధాకర్, సత్తయ్య, తిరుపతి, హరీష్, సందీప్, సంతోష్, రమేష్, వెంకటి, వెంకన్న, సంజీవ్, బిక్కు, పెంటు, రమేష్, కురణ్, బాలాజీ, శ్యామ్ రావు, దాదాజీ, రాజేశం, అన్నారావు, శ్రవణ్, బాపు, నగేష్, అశోక్, మారుతి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పిడుగు శంకర్ పాల్గొన్నారు.

ప్రతిభావంతుల సత్కారానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

క్రిస్మస్ పండుగ-2023 సందర్భంగా విద్య, వైద్య, సాహిత్యం, కళా, క్రీడా రంగాలలో ఉత్తమ సేవ, ప్రతిభ కనబరిచిన ప్రతిభావంతులైన క్రైస్తవులను, సంస్థలను ప్రభుత్వం సత్కరించనున్నందున అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రంగాలలో 30 సంవత్సరాలకు పైబడి ఉత్తమ సేవ, ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, సంస్థల నుంచి నామినేషన్లు స్వీకరిస్తుందని, నామినేషన్ ఫారాలను మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ (మైనార్టీ) ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో పొందవచ్చని, ఆన్‌లైన్‌లో టీఎస్‌సీఎంఎఫ్‌సీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చని, పూర్తి చేసిన నామినేషన్లను నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో గల జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ లోగా సమర్పించాలని కోరారు. అర్హత గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మద్దతు ధరను రైతులు వినియోగించుకోవాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వరి పంటకు మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ వేణు, జిల్లా పౌరసరఫరాల అధికారి తారామణి, ముఖ్య ప్రణాళిక అధికా రవీందర్‌తో కలిసి పోస్టర్లనుదచీశీఅవగ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. గోనె సంచులను రైతు కల్లాలకు, అనుమతి లేని ప్రదేశాలకు ఇవ్వకూడదని, ధాన్యం తేమ శాతం 17 కంటే తక్కువ ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రశీదును సంబంధిత రైతులకు అందజేయాలని, వ్యవసాయ శాఖ, వ్యవసాయ విస్తరణ శాఖ ధ్రువపత్రం లేకుండా ధాన్యం కొనుగోలు చేయకూడదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2 వేల 203, సాధారణ రకానికి రూ.2 వేల 183 చెల్లించడం జరుగుతుందని, రైతులు మద్దతు ధర పొందాలంటే కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్త-తాలు, మట్టిపెడ్డలు, రాళ్ల లేకుండా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. తేమ గరిష్టంగా 17 శాతం, చెత్త-తాలు 1 శాతం, మట్టి పెడ్డలు-రాళ్ళు 1 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారు కాని, ముడుచుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకముల మిశ్రమం 6 శాతం, చెడిపోయిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 4 శాతానికి మించి ఉండరాదని తెలిపారు. రైతులు తమ ఫోన్ నంబర్‌ను ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాతో అనుసంధానం చేసుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, మొబైల్ నెంబర్ అనుసంధానానికి బ్యాంకులు, ఆధార్ కేంద్రాలు, పోస్టాఫీసులు, మీ-సేవా కేంద్రాలలో సంప్రదించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించే సమయంలో ఓటీపీ నెంబర్ కోసం రైతులు తమ మొబైల్ ఫోన్‌ను తమ వద్ద ఖచ్చితంగా ఉండేలా చూసుకోవాలని, నెంబర్ వచ్చిన తరువాతనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులు తమ ఆధార్‌కార్డు, జిల్లా కలెక్టర్‌చే నియమించబడిన అధికారి ధ్రువీకరణ పత్రం, పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతి, బ్యాంక్ ఖాతా పని చేస్తున్నట్లుగా బ్యాంక్ అధికారుల నుంచి ధ్రువీకరణ తీసుకొని కొనుగోలు కేంద్రాలకు రావాలని తెలిపారు. కనీస మద్దతు ధర, ఇతర ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ 1967, 1800 425 0033 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లర్ దగ్గర నుంచి రశీదు తీసుకొని 48 గంటలలోగా రైతులకు నగదు జమ చేసే విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు, వెయింగ్ మిషన్లు, మాయిశ్చర్ మీటర్లు, ధాన్యాన్ని శుభ్రపరిచే క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-కౌటాల

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప మండలంలోని మార్దండి గ్రామ సర్పంచ్ మడావి రేణుక కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఆమె అత్తగారు మృతి చెందిన విషయం తెలుసుకుని గ్రామానికి వెళ్లారు. గుడ్ల బోరి గ్రామానికి చెందిన యువ నాయకుడు ముర్మర్ వాయు కుమార్ నానమ్మ నీలా బాయి హఠాన్మరణం చెందగా పరామర్శించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య, ఎంపీటీసీ వసంత్ రావు, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తాల్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు బాజీ రావు, సంతోష్, విద్యాసాగర్‌రావు, జవహర్ ఉన్నారు.

ఎండీఎం కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల తో కలిసి డీఈఓ కార్యాలయ ఏడీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. కార్మికులు గత ప్రభుత్వంలో ప్రశ్నించే పరిస్థితి లేకుండా ఉండేదని ఆరోపించారు. అల్పాహార పథకంలో కార్మికులపై అదనపు భారం మోపిందన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మాయ, నాయకురాలు విజయ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని నాగుల్వాయి గ్రామంలో సురేష్ ఆత్మహత్య చేసుకోవడంతో బాధిత కుటుంబసభ్యులను మంగళవారం బీజేపీ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి సాయం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని బీజేపీ నాయకుడు సామల తిరుపతి హామీ ఇచ్చారు. ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అన్నారం తిరుపతి, చౌదరి కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన



ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే కోవలక్ష్మిని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, ఖైరిగూడ పిట్ సెక్రటరీ కార్నాదం వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి నాకు అండగా నిలిచిన ప్రతి ఒక సింగరేణి కార్మికుడికి, టీబీజీకేఎస్ నాయకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. మీకు ఎల్లవేళల అండగా ఉంటానని, ఎలాంటి సమస్యలైనా తీర్చే బాధ్యత నాదన్నారు. గత 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం రాగానే ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులను కల్పించడం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కార్మికులు సమ్మెలో పాల్గొని తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన సింగరేణి కార్మికులకు సమ్మెలో పాల్గొన్న వారికి వేతనాలను కూడా చెల్లించడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. అంతేకాకుండా గత ప్రభుత్వాలు జాతీయ సంఘాల నాయకులు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలు తిరిగి అమలుచేసి దాదాపు 15 వేల మందికి వారసత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అంతేకాకుండా కోలిండియాలో లేని హక్కులను తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కార్మికులకు ఇప్పించిన ఘనత కూడా కేసీఆర్‌దేనన్నారు. సింగరేణి కార్మికులు టీబీజీకేఎస్ నాయకత్వానికి అండగా నిలబడాలన్నారు.

ఈ-కేవైసీ కోసం బారులుతీరిన వినియోగదారులు

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద ఈ-కేవైసీ చేసుకోవడానికి మండలంలోని ప్రజలు రావడంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో భాగంగా ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తామనడంతో కేవైసీ చేసుకోవడానికి ఉదయం నుండే గ్యాస్ వినియోగదారులు పెద్ద సంఖ్యలో రావడంతో కార్యాలయం వద్ద సందడి నెలకొంది. ప్రతి ఒక్కరు కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రచారం జరగడంతో రూ.500 గ్యాస్ రాదేమోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

గణితశాస్త్రం అధ్యాపకుడిపై కేసు నమోదు

నవతెలంగాణ-బెజ్జూరు

బెజ్జూరు జూనియర్ కళాశాల గణితశాస్త్రం అధ్యాపకుడు నాగరాజుపై మంగళవారం కేసు నమోదుచేసినట్టు ఎస్సై విక్రమ్ తెలిపారు. అదే కళాశాల ప్రిన్సిపాల్ రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు పేర్కొన్నారు. నకిలి ధ్రువీకరణ పత్రాలు సమర్పించినందుకు ఇంటర్ మీడియట్ బోర్డు ఆదేశాలను అనుసరిస్తూ ప్రిన్సిపాల్ రాజయ్య ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

ఎమ్మెల్యే హరీష్‌బాబుకు సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును తన నివాసంలో మంగళవారం పలు శాఖల అధికారులు, సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామీణ నీటి సరఫరాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మండల ప్రజా పరిషత్ అధికారులు ఎమ్మెల్యే హరీష్‌కు పుష్ప గుచ్చం అందజేసి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా కేంద్రానికి చేరిన శివ భక్తుల పాదయాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం వరకు పాదయాత్రగా వెళ్తున్న శివ భక్తుల పాదయాత్ర జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయానికి చేరుకుంది. ఆలయంలో పూజారి శిరీష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీన నాందేడ్ నుంచి పాదయాత్రగా బయలుదేరామని మరో వారం రోజుల్లో శ్రీశైలం చేరే అవకాశం ఉందన్నారు. పాదయాత్రగా బయలుదేరిన వారిలో భూపాల్, అస్రుబ, కార్తీక్, పసుబాయి, కొండబాయి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వివేక్, శ్రీనివాస్, రమేష్, ఉమేందర్, శంకర్, కృపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక కాగా ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్‌తో కలిసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. నెట్ బాల్ అభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ తెలంగాణ నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదవ తరగతి విద్యార్థి మేకర్తి వంశీ వర్ధన్, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి జంజిరాల అజయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగనున్న నెట్ బాల్ ఫెడరేషన్ కప్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ తిరుపతి, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే టీబీజీకేఎస్ ధ్యేయం



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులను కల్పించిన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అనుబంధ సంస్థ అయిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు సింగరేణి కార్మికులను కోరారు. మంగళవారం గోలేటిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు కోలిండియాలో లేని ఎన్నో హక్కులను కల్పించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు సమ్మయ్య, కోగిలాల రవీందర్, మారిన వెంకటేశ్, శ్రీనివాస్, కార్నాదం వెంకటేశం, దేవేందర్, రాజేశం, ఆవుల శ్రీనివాస్, మేకర్తి మల్లేష్, అన్నం లక్ష్మయ్య, గోలేటి మాజీ సర్పంచ్ తోట లక్ష్మణ్, విమలేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వనజ, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు వ్యవసాయ విభాగం కేసులు తేవాలి

● సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 30వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి వ్యవసాయ విభాగానికి సంబంధించిన రాజీ కేసులు వచ్చేలా చూడాలని దానిని విజయవంతం చేయాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోర్టు హాల్ లో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దీనికి వ్యవసాయ విభాగానికి చెందిన రాజీ కేసులు వచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఏడీఏలు మిలింద్, వెంకటి ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు కొనుగోలు పత్రాలు అందజేయాలి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం విక్రయించిన రైతులకు కొనుగోలు పత్రాలు అందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కొత్తూర్ (డీసీఎంఎస్), రెబ్బెనపల్లి, నెల్కివెంకటాపూర్ (డీఆర్‌డీఏ) ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 5 ఒకసారి ఎంపిక చేసిన గ్రామాలలో పంటకోత ప్రయోగాలు నిర్వహించడం జరుగుతుందని, ఎంపిక చేయబడిన భూములలో 5 మీటర్ల స్థలంలో కోత ద్వారా ప్రయోగం నిర్వహిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడిని డిజిటల్ మిషన్ ద్వారా లెక్కించి ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చడంతో అన్ని జిల్లాల నుంచి సేకరించిన సగటు దిగుబడిని రాష్ట్ర స్థాయిలో అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు 40 కిలోల 650 గ్రాముల బస్తా బరువు, దాదాపుగా 41 కిలోల వరకు మాత్రమే కాంట చేయాలని, ధాన్యం విక్రయించిన రైతులందరికీ కొనుగోలు పత్రాలు ఇవ్వాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్లో నమోదు చేసి రైతులకు 48 గంటలలో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజేందర్, మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్, మండల ప్రణాళిక అధికారి సుమన్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లలపై సర్వే

నవతెలంగాణ-వాంకిడి

మండలంలో బడి బయట ఉన్న పిల్లల సర్వేను మంగళవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా సీఆర్‌పీలు గ్రామాల్లో తిరుగుతూ బడి మానేసిన పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. సర్వే వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని సీఆర్‌పీ సందీప్ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : కోనప్ప

నవతెలంగాణ-బెజ్జూరు

ప్రజలిచ్చిన తీర్పు మేరకు ప్రతిపక్షంలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు ఎల్లవేళల అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నెరవేర్చే విధంగా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అధైర్య పడకుండా సమస్యలను పరిష్కారం దిశగా పోరాటం చేయాలని సూచించారు. తన ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచిన కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోకె వెంకన్న, జావీద్ అలీ, జావీద్ హుస్సేన్, అమీరొద్దీన్, మహేష్, పొర్తెటి రవి, సకారాం, ఓంప్రకాష్, తాజొద్దీన్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బెజ్జూరు



మండలకేంద్రంలోని యాదవ్ సంతోష్ ఇంటి వద్ద అక్రమంగా నిల్వవుంచిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడిచేసి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించగా యాదవ్ సంతోష్ ఇంటిలో అక్రమంగా నిల్వఉంచిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించినట్టు తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్టు పేర్కొన్నారు.

దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-బెజ్జూరు



మండలంలోని బండ్లగూడ, నాగెపెల్లి గ్రామాల్లో సీఐ సాదిక్‌పాషా, ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలితీవ్రత ఎక్కువ కావడంతో చలి నుంచి కాపాడుకోవడానికి గిరిజనులకు దుప్పట్లు ఎంతగానో ఉపయోగపడుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. పోలీసులు మీకోసంలో భాగంగా ప్రజలకు దగ్గరయ్యే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నట్టు సీఐ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 13, 2023 | www.navatelangana.com

బీసీ జనగణన చేపట్టాలి

నవతెలంగాణ -ముథోల్

తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ జనగణన చేపట్టాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గురుప్రసాద్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 150 ఉన్న బీసి కులాలలో ఇప్పటివరకు జనగణన చేయకపోవటం బాధాకరమైన విషయమన్నారు. బీసీలు 80 శాతం ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మాత్రం రెండు, ఏడు, ఎనిమిది శాతం ఉన్నటువంటి కులాలే రాజ్యాధికారం చేపడుతున్నాయని వాపోయారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలంటే బీసీ జనగణన కచ్చితంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ జనగణన జరిగినట్లయితే విద్య, రాజకీయాల్లో రిజర్వేషన్లు ఎక్కువ మొత్తంలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ జనగణన చేయిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే బీసీ జనగణనకు సిద్ధపడాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రంలో బీసీ సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

నవతెలంగాణ-బోథ్

చెక్ బౌన్స్ కేసులో ఒకరికి యేడాది జైలు శిక్షతో పాటు రూ. లక్షా 60వేల చెల్లించాలని బోథ్ కోర్టు న్యాయమూర్తి బి.హుస్సేన్ తీర్పు వెలువరించారని కోర్టు వర్గాలు తెలిపాయి. కోర్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండల కేంద్రానికి చెందిన సూర్యవంశీ శ్రీనివాస్ 2018 సంవత్సరంలో తన దగ్గర నుంచి బోథ్ మండల కేంద్రానికి చెందిన ఖాజాపాష రూ.లక్షా 60వేలు తీసుకొని డబ్బులు అడిగితే చెక్కు ఇచ్చాడు. చెక్ బౌన్స్ కావడంతో డబ్బులు అడిగినా ఇవ్వకపోవడంతో బోథ్ కోర్టులో సీసీ నెం.245/2018 కేసు వేశారు. ఈ కేసులో పూర్తి విచారణ తరువాత సాక్ష్యధారాలు పరిశీలించిన అనంతరం బోథ్ కోర్టు న్యాయమూర్తి బి.హుస్సేన్, ఖాజా పాషాకు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.లక్షా 60వేలు కట్టాలని తీర్పునిచ్చినట్టు తెలిపారు.

కరాటేలో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థులు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు కరాటే పోటీలో సత్తా చాటారు. ఈనెల 9, 10న కాగజ్‌నగర్‌లో నేషనల్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీలో 12 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో ఆరుగురికి స్వర్ణ పథకాలు, మరో ఆరుగురు రజత పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినులను ఎస్ఓ రాథోడ్ వనిత, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తా : బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్‌లో ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మొదటిసారిగా నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌కు విచ్చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గం మూడు జిల్లాలతో సంబంధాలు ఉన్నాయని, ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలో తాను ఉంటానని సూచించారు. తనను గెలిపించిన ఖానాపూర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఖానాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. మొట్టమొదటిసారి ఖానాపూర్‌కు వచ్చిన ఎమ్మెల్యేను కార్యకర్తలు అభిమానులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దయానంద్, తోట సత్యం, కడార్ల గంగ నర్సయ్య, రాజుర సత్యం, జహీర్ పాల్గొన్నారు.

బోథ్ బస్టాండ్ ప్రహరీ గోడ నిర్మించాలి



నవతెలంగాణ-బోథ్

బోథ్ బస్టాండ్ ప్రహరీ గోడ నిర్మించాలని సర్పంచ్ సురేందర్ యాదవ్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పర్యటనలో భాగంగా బోథ్ ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. బోథ్ మండలంలోని చుట్టుపక్క గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, రెవెన్యూ డివిజన్ అంశం కొత్త ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. బస్టాండ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-తాండూర్

భీమిని మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు జలంధర్ హత్య కేసులో ముత్యం పురుషోత్తం, ఇందూరి రాజశేఖర్‌లను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్టు బెల్లంపల్లి ఏసీపీ సదయ్య తెలిపారు. మృతుడి భార్య బొడ్డు శారద పిర్యాదు మేరకు ఈ నెల ఒకటవ తేదీన హత్య నేరం, ఎస్సీ, ఎస్టీ చట్టాలా కింద కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరిగిందని తెలిపారు. ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా మొదటి నిందితుడు ముత్యాల రాజశేఖర్ గౌడ్‌ను ఈ నెల 3వ తేదీనా అరెస్ట్ చేసి కోర్ట్‌లో ప్రవేశ పెట్టడడం జరిగిందన్నారు. హత్యకు సహకరించిన వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. హత్యా నేరానికి సంబంధించిన సాక్షాల సేకరణలో ప్రత్యేక పోలీసు విభాగం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో నేరారోపణలు ఉన్న వారిని సైతం సాక్షాదారాలతో అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడతామని తెలిపారు.

డీఎంఎఫ్‌టీ రోడ్ల పరిశీలన

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని కొండాపూర్ యాప, లంబాడితండా(డి), ధర్మారావుపేట, మల్కేపల్లి, దేవాపూర్ రాంపూర్, దేవాపూర్ గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ఎంపీడీవో ఎంఎ అలీం పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్‌లోకి 10వ వార్డు కౌన్సిలర్

లక్షెట్టిపేట : లక్షెట్టిపేట మున్సిపాలిటీ 10వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ గోడిసెల లక్ష్మి కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతా అశోక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివద్ధి, సంక్షేమం కోసం పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన మైనార్టీ నాయకులు

జన్నారం : నూతనంగా ఎన్నికైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును బుధవారం మండలం మైనారిటీ సంఘం నాయకులు ఫసివుల్ల రియాజుద్దీన్, ముజ్జా రజాక్‌లు శాలువా పూలమాలలతో సత్కరించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ 35 ఏళ్ల చరిత్రను తిరగరాసి పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందినందుకు ఆయనను అభినందించారు. మైనారిటీల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.

మహాలక్ష్మీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్



నవతెలంగాణ-బోథ్

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. మంగళవారం బోథ్ ఆర్టీసీ బస్టాండ్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు అందిస్తున్న సేవలు ప్రయాణ సౌకర్యాలను బస్‌లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా ప్రయాణికులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణం కొనసాగించేలా వారికి సహకరించాలని కండక్టర్‌లకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు ఇంటర్ డిగ్రీ కళాశాలల విద్యార్థినులకు మండల జిల్లా కేంద్రాలకు బస్‌లలో ఉచిత ప్రయాణం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 81 వేల మంది మహిళా ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించారని అన్నారు. మహిళలందరూ మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బోథ్ స్థానిక జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు చదువులలో రాణించాలని సూచించారు. జరగబోయే పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ చంద్ర, నాయకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పరిశుభ్రత, తాగునీరు తదితర పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో జరుగుతున్న పచ్చదనం, పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేసి సేకరణ, విద్యుత్, తాగునీరు సరఫరా, ఇతర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లేబర్ మోబలైజేషన్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీ, ఎంపీఓలు ఉదయమే ఫీల్డ్‌కి వెళ్లాలని ఆదేశించారు. సానిటేషన్, ఎవెన్యూ ప్లాంటేషన్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టాలని అన్నారు. గడప గడపకు చెత్త సేకరణ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రతిరోజు సమాచారం అందించాలని డీపీఓను ఆదేశించారు. పల్లెప్రకృతి వనాల నిర్వాహణ, గ్రామపంచాయతీ అధికారులు చూడాలని అన్నారు. మొక్కలు వాడకుండా ప్రతీరోజు నీరందించాలని అన్నారు. రోడ్ల మీద చెత్త చెదారం లేకుండ శుభ్రంగా ఉంచాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పంచాయతీ భవనాల అనుమతి త్వరగా తీసుకొని నిర్మాణం పనులు ప్రారంభించాలని అన్నారు. పెంబి, ఖానాపూర్ మండలాలో ప్రత్యేక శ్రద్ద వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎఫ్ఓ రాంకిషన్, డీఆర్డీఓ విజయలక్ష్మీ, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ఎల్‌డీఎం చంద్రశేఖర్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్‌లో మంగళవారం మలిదశ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారులు అత్యంత కీలక పాత్ర పోషించారన్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు అక్రమ కేసులు పెట్టారని, దీని వల్ల విద్యార్థులు, యువత, ఉద్యమకారులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. దశాబ్ది కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులను గుర్తించలేదన్నారు. అక్రమ కేసులతో ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని, ప్రతినెల గౌరవ భృతి కింద రూ.25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లుతో పాటు, 250 చదరపు గజాల స్థలం, ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు రూప్నర్ రమేశ్, కొండ్ర రాజేశ్వర్, బోగే ఉపేందర్, సావిత్రి, చిరంజీవి, బాబురావు, అశోక్, ఉత్తమ్ నాయక్ పాల్గొన్నారు.



ఘనంగా సేవా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-నస్పూర్

సేవా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో ఏరియా జీఎం సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి చేతుల మీదుగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలో ఈ సంవత్సరం 473 మంది మహిళలు వివిధ వృత్తి శిక్షణ కోర్సులు నేర్చుకోవడం అభినందించదగిన విషయమన్నారు. మహిళలు ముందుకు వస్తే నూతన కోర్సులను కూడా ప్రవేశపెట్టడానికి యాజమాన్యం తగిన ప్రణాళికతో ముందుకు వెళతుందని తెలిపారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు మాట్లాడుతూ సేవా సమితి 2000 డిసెంబర్ 10న ఆవిర్భవించిందని, దీని ద్వారా శ్రీరాంపూర్ వ్యాప్తంగా అనేక మంది యువతీయువకులకు టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ డ్రైవింగ్, హెవీ డ్రైవింగ్, వోల్వా డ్రైవింగ్ కోర్సులలో శిక్షణ ఇచ్చి వారి కుటుంబానికి అండగా నిలబడేలా తీర్చుదిద్దుతోందని గుర్తు చేశారు. 23 సంవత్సరాలుగా సింగరేణి సేవా సమితి ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలో అనేక మంది నిరుపేద యువతీయువకులు స్వయం ఉపాధి సాధించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి-రఘు కుమార్, డీజీఎం (ప) అరవింద్ రావు, సీనియర్ పీఓ కాంతారావు, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి, సేవా సభ్యులు శారద, తిరుమల, రజిత, సునీత, లక్ష్మి, రమ, సేవా సోదరీమణులు పాల్గొన్నారు.

నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపుకు జిల్లా విద్యార్థి

- అభినందనలు తెలిపిన కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్ వారు నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి పోటీలలో జిల్లా వాసి ఎంకయ్యారు. హిమాచల్‌ప్రదేశ్, ధర్మశాలలోని అటల్ బిహారీ వాజ్‌పాయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ అల్లైడ్ స్పోర్ట్స్‌లో డిసెంబర్ 23 నుంచి జనవరి 1 వరకు పది రోజుల పాటు నేషనల్ అడ్వెంచర్ ట్రెనింగ్ క్యాంపు జరగనుంది. ఈ క్యాంప్‌లో పాల్గొనేందుకు ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఆదిలాబాద్‌కు చెందిన ఎంపీసీ విద్యార్థి, వాలంటీర్ సూర్యకాంత్ ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపాల్ సూర్యకాంత్‌కు పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి. దయాకర్, అష్రఫ్ అలీ, అధ్యాపకులు రఘునాథ్, సంతోష్‌కుమార్, రమేశ్ తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది సూర్యకాంత్‌ను అభినందించారు.



టీబీజీకేఎస్ కృషి ఫలితమే కారుణ్య నియామకాలు

నవతెలంగాణ-కాసిపేట

టీబీజీకేఎస్ కృషి ఫలితంగానే సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టారని ఆ సంఘం ఏరియా ఉపాధ్యాక్షుడు మేడిపల్లి సంపత్, టీబీజీకేఎస్ రీజినల్ సెక్రెటరీ ఓ రాజశేఖర్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై టీబీజీకేఎస్ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పోగొట్టిన జాతీయ సంఘాలు ఏ మొహం పెట్టుకొని కార్మికులను ఓటు అడగడానికి వస్తున్నారని, జాతీయ సంఘాలు గ్యారంటీల పేరుతో గారడీ చేయడానికి వస్తున్నారన్నారు. టీబీజీకేఎస్ ఎప్పటికీ కార్మికులకు హక్కులను సాధించి ఎన్నో గ్యారంటీలను అందించడం జరిగిందన్నారు. గతంలో బాల్క సుమన్, కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారమే కారుణ్య నియామకాలు ద్వారా జాతీయ సంఘాల కుట్రను కూడా భగ్నం చేసి కార్మిక కుటుంబాల్లో వెలుగులు నిపామని గుర్తు చేశారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ బాణం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, కాసిపేట-2 ఇంక్లైన్ ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ సారంగపాణి, వర్కున్ ఇన్స్‌పెక్టర్ సిగ్గం శ్రీనివాస్, గోపాల కృష్ణ, కిరణ్, శివ, కృష్ణ మోహన్, రవి కిరణ్, బిక్షపతి, మహబూబ్ కార్మికులు పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి 'ఆరోగ్య మహిళ'

నవతెలంగాణ-తాండూర్

మహిళల్లో సంపూర్ణ ఆరోగ్యం పెంపొందించడానికి ప్రతి మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహిళా వైద్యాధికారి సుచరిత తెలిపారు. మంగళవారం తాండూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. మంగళవారం మహిళలకు గర్భస్థ సమస్యలు పోషకాలలోపం బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్‌తో పాటు అన్ని రకాల రోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రోగుల అవసరం మేరకు రక్త పరీక్షలు సేకరించి ల్యాబ్‌లకు పంపించడం జరుగుతుందన్నారు. మహిళల ఆరోగ్యానికి సంబంధించి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు ప్రయివేటు ఆస్పత్రులను సంప్రదించి డబ్బులను వృధా చేసుకోరాదని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖప్రసవం జరిగేందుకు అవసరమైన సిబ్బందితో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో సీహెచ్ఎస్ జే మేరి, పద్మ సూపర్వైజర్ తార ఏఎన్ఎం పారిజాతం ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం(మహాలక్ష్మి) పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు నసీరుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆటో, జీప్, టాటా ఏసీ డ్రైవర్లు వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి, ఆటోలన్నీ బంధు చేసి శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ ఉచిత బస్సు పథకంతో టాటా ఏసీ, ఆటో, జీప్, డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆ వాహనాలు రోడ్డుపై సక్రమంగా నడవకపోవడంతో వాటికి సంబంధించిన గ్యారేజీలు దుకాణాలు, దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆటో జీప్ టాటా ఏసీ డ్రైవర్లు ఓనర్లు నసీరుద్దీన్, బాబా, శంకర్, రాజన్న శ్రీనివాస్, మల్లేష్, నరసయ్య పాల్గొన్నారు.

కాసిపేట: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకంతో ఎవరూ ఆటోలు ఎక్కడం లేదని, దీంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి రోడ్ల మీద పడేలా ఉందని, వెంటనే ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని సోమగూడెం ఆటో డ్రైవర్లు, ఆటో ఓనర్లు కోరారు. మంగళవారం సోమగూడెం చౌరస్తాలో ఆటో డ్రైవర్ల తమ ఆవేదనను వివరిస్తూ నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారేంటీల్లో భాగంగా అమలు చేసిన మహిళలకు ఉచిత ప్రయాణ పథకంతో ఆటో డ్రైవర్ల, ఆటో ఓనర్ల పొట్ట కొడుతున్నారన్నారు. ఆటో డ్రైవర్లు తమ కుటుంబంతో సహా రోడ్ల మీద పడేలా ఉందని, దీనికి పరిష్కారం చూపాలని సోనియా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని నెలకు రూ.15000 జీతం, రిటైర్డ్ ఆటో డ్రైవర్లకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఆటో మీదనే ఏళ్ల నుంచి కుటుంబాలను పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోమగూడెం ఆటో డ్రైవర్లు, ఆటో ఓనర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలి

నవతెలంగాణ-జన్నారం

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్‌రావు సూచించారు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళలకు అందిస్తున్న వివిధ వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే మహిళలకు, ప్రజలకు, రోగులకు మంచి వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. మండల వైద్యాధికారి ఉమాశ్రీ, వైద్య సిబ్బంది ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల సమాచారం కోసం వినతి

నవతెలంగాణ-కాసిపేట

ముత్యంపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించి 2018 నుంచి 2023 వరకు వెబ్ సైట్ చెక్ లిస్ట్, క్యాష్ బుక్ జిరాక్స్, నిధుల వివరాలు ఇవ్వాలని కాంగ్రెస్ ముత్యంపల్లి టౌన్ అధ్యక్షుడు మైదం రమేష్ సమాచారం కోరుతూ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సిరాజ్‌ఖాన్, వార్డు సభ్యులు మంద వెంకటేష్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గోలేటి స్వామి, రేషవేని బాపు, అక్కిపెల్లి రాజేష్, విజయ, పులగం వేంకటేశ, జనార్ధన్, మారం సురేష్, సిద్ధం రవి, రౌతు పవన్ పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
పెద్దపల్లి
బుధవారం | డిసెంబర్ 13, 2023 | www.navatelangana.com

ఆర్టీసి బస్సులో ప్రయాణించిన కలెక్టర్

ప్రయాణ సౌకర్యాలను తనిఖీ చేసిన ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
మంథని మండల కేంద్రంలో పర్యటన అనంతరం మంగళ వారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి తిరుగు ప్రయాణంలో కమాన్‌పూర్ బస్ సెంటర్‌లో ఆగి ప్రయాణికులతో ముచ్చటించారు. అనంతరం ఆర్టీసీ బస్సులో ఎక్కి కమాన్ పూర్ నుంచి పెద్దపల్లి వరకు ప్రయాణించారు.ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ జిల్లా కలెక్టర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీలో కల్పిస్తున్న సౌకర్యాలను, బస్సులు సమయంలోనే వస్తున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, టికెట్ లేకుండా ప్రయాణం ఎలా ఉందని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కండక్టర్‌తో మాట్లాడుతూ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేలా సహకరించాలని సూచించారు.



నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణిలో గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే అండర్ గ్రౌండ్ బొగ్గు గనులను ప్రారంభింపజేసి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్‌లు నర్సింహారెడ్డి, ధర్మపురి అన్నారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-1వ ఇంక్లైన్ ఏరియా ఆసుపత్రిలలో వివిధ యూనియన్ల నుంచి దాదాపు 80మంది కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరగా వారికి యూనియన్ కండువా కప్పి వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గడియారం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు జనగామ రాజేశం, అశోక్ చక్రవర్తి, ఆరేపల్లి శ్రీనివాస్, దేవులపల్లి రాజేందర్, ఎట్టం కృష్ణ, వికాస్ కుమార్, పోతరబోయిన సమ్మయ్య, అన్వేష్, శేష రత్నంలు తదితరులున్నారు.

సింగరేణి భవిష్యత్ ఏఐటీయూసీ గెలుపు మీదనే ఆధారపడి ఉంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:
సింగరేణి భవిష్యత్ ఏఐటీయూసీ గెలుపు మీదనే ఆధారపడి ఉందని ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్ కుమార్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ అన్నారు. మంగళవారం ఓసీపీ-3 ఎస్అండ్‌డి సెక్షన్ లో కార్యదర్శి రాజా సాగర్ అధ్యక్షతన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈయొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్ కుమార్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ ద్వారానే హక్కులు రక్షించబడతాయని, సంస్థకు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఎలక్షన్ అయిన వెంటనే సింగరేణిలో చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్స్ ఇప్పిస్తామని, ఎస్-1 రద్దు చేపించి కరోనా ముందు ఉన్న మాదిరిగా ప్లేడేలు,పేహాలిడే లు ఇప్పిస్తామని, స్వంత ఇంటి పథకం కింద 200 గజాల స్థలం,20 లక్షలు వడ్డీ లేని ఋణం ఇప్పిస్తామని అన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ ఇన్‌చార్జీ రాజారత్నం, బ్రాంచ్ సెక్రటరీ జిగురు రవీందర్, వైస్ ప్రెసిడెంట్ అన్నారావు, రాష్ట్ర నాయకులు బుర్ర తిరుపతి,నాయకులు శ్యామ్సన్ ,గంధం సాంబశివరావు, వెంకటేశ్వర్లు, ఎజ్జి రాజయ్య, సదయ్య పాల్గొన్నారు.

మైనింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి



అధికారికి సమస్యలను తెలియజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:
సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న మైనింగ్ సిబ్బంది ఓసీపీ గనిలోని పనుల పర్యవేక్షణ పరిధిని నిర్ధారించాలని కోరుతూ మంగళవారం డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ అధికారి నాగేశ్వరరావుకి సింగరేణి మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ చేసిన విజ్ఞప్తిపై సావధానంగా విని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని సింగరేణి మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ కన్వీనర్ మాదాసి రామమూర్తి, కో-కన్వీనర్ నాగేల్లి సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సల్లా రవీందర్ రెడ్డి శ్రీకాంత్ , బంటు సురేష్, పోతరాజు రాజు, గొడుగు రాజయ్య, జక్కుల కిషన్ రావు, జి అశోక్ కుమార్, వి.కళాధర్, కొవ్వూరు వెంకటేశ్వర్లు, గుంటుకు రాజయ్య, కిషోర్, ప్రసన్న కుమార్, సంపత్‌లు పాల్గొన్నారు.

అమ్మపరివార్ ఆశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
నీడ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వంగపల్లి సౌమ్యా సురేందర్ రెడ్డి తల్లి దావు రమాదేవి 4వ వర్ధంతి సందర్భంగా గోదావరిఖనిలోని అమ్మపరివార్ ఆశ్రమంలోని చిన్నారులకు, వృద్ధులకు నీడ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళ వారం అన్నదానం ఏర్పాటు చేశారు. దావు రమాదేవి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మరింత సహాయం చేసే శక్తి ప్రసాదించాలని ఈ సందర్భంగా పల్లెర్ల రమేష్ గౌడ్ వేడుకున్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న రమేష్ గౌడ్

మంత్రిని కలిసిన మచ్చుపేట కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ముత్తారం:
తెలంగాణా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ముత్తారం మండలంలోని మచ్చు పేట గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌బాబుకు పూలబొకే అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మచ్చుపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాల్లపల్లి కుమారస్వామి, వార్డు సభ్యులు దొంతుల రాకేష్, జెట్టవెన రాకేష్, యూత్ అధ్యక్షుడు కలవెన దేవరాజ్‌లు పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమస్యలపై పోరాడుతున్న సీఐటీయూను గెలిపించాలి

▸ **తెలంగాణ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్**

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి సంస్థ కార్మికుల హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న సీఐటీయూని ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ కార్మికులను కోరారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-2ఎ ఇంక్లైన్‌లో ఫిట్ కార్యదర్శి వంగల శివరాంరెడ్డి అధ్యక్షతన మంగళవారం గేట్ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ పెద్దపెల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల కుమారస్వామి, ఎర్రవెల్లి ముత్యంరావు, ఆర్జీ-1 అధ్యక్ష కార్యదర్శులు మేదరి సారయ్య, మెండే శ్రీనివాస్, జె.గజేంద్ర, ఉపాధ్యక్షులు ఆసరి మహేష్, ఫిట్ కార్యదర్శి వంగల శివరాం రెడ్డి, బూరుగుల రాములు, దుర్గాప్రసాద్, రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

▸ **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

నవతెలంగాణ-మంథని
కృత్యధార విధానం ద్వార తరగతి భోదనా చేసి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంథనిలో పర్యటించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి పాఠశాలల సముదాయ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రైమరీ టీచర్స్ కాంప్లెక్స్ మీటింగ్ లో ఉపాధ్యాయులు ప్రదర్శించిన టీఎల్ఎం. ద్వారా విద్యా భోధనను జిల్లా కలెక్టర్ పరిశీలించి మాట్లాడుతూ,ప్రతి ఒక్క ఉపాధ్యాయులు ఐదు అంశాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల, పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉపాధ్యాయుల కృషి వల్లే తొలిమెట్టు సక్సెస్ అయిందని,మనమంతా మన ఆత్మ సాక్షిగా, పట్టుదలతో పనిచేస్తే మన పాఠశాల స్థాయి మరింత ఉన్నతంగా మారుతుందని,తద్వారా రాబోయేతరం నాణ్యమైన సమాజాన్ని నిర్మిస్తుందని అన్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి పెట్టి తల్లిదండ్రులను సంప్రదించాలని,సరైన కారణాలు తెలుసుకొని విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చే విధంగా చూడాలని సూచించారు. బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి విద్యార్థుల యొక్క సామర్థ్యాల ఆధారంగా బోధన చెయ్యాలని, ఉపాధ్యాయులు అందరూ హాజరుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, సెలవుపై వెళ్తున్న ఉపాధ్యాయుడు ముందస్తుగా తన సెలవులను మంజూరు చేయించుకోవాలని, తరగతి గదిలో జరిగే బోధన విధానాన్ని విద్యార్థులు చేసే కృత్యాలను తల్లిదండ్రులకు వాట్సప్ గ్రూపుల ద్వారా పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి డి.మాధవి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.ఎం.షేక్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సురేష్ కుమార్, కాంప్లెక్స్ హెచ్ఎంలు ఎం.శ్రీనివాస్, కే. శ్రీనివాస్,సీఆర్పీలు., ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఏఐటీయూసీ న్యాయపోరాటం వల్లనే సింగరేణి ఎన్నికలు

▸ **వాయిదాలు వేయించిన సంఘాలు ఓట్లేలా అడుగుతారు**

▸ **ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య**

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణిలో ఏఐటీయూసీ న్యాయపోరాటం వల్లనే ప్రభుత్వం, యాజమాన్యం ఎన్నికలు నిర్వహిస్తుందని వాయిదాలు వేయించిన సంఘాలు ఓట్లేలా అడుగుతారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కే.స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు ప్రశ్నించారు. మంగళవారం సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే 11వ ఇంక్లైన్‌లో ప్రి-షిఫ్ట్ మొదలు ఉదయం 9 గంటల వరకు మూడు షిఫ్టుల్లో జరిగిన గేట్ మీటింగ్‌లలో వారు పాల్గొని మాట్లాడుతూ 2017 అక్టోబర్ 5న ఆరవసారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఆరు సంవత్సరాలు గడిచినా అటు ప్రభుత్వం ఇటు యజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లుండి వాయిదాల మీద వాయిదాలు వేస్తే ఏఐటీయూసీ 2022లో హైకోర్టుకు వెళ్ళి న్యాయపోరాటం చేసి విజయం సాధించడం వల్లనే నేడు ఏడోసారి సింగరేణిలో ఎన్నికలు జరుగుతు న్నాయని వారు తెలిపారు. కారుణ్య నియామకాల పేర కాసుల దందా నడిపిన టీబీజీకేఎస్ పదేండ్లుగా నిద్ర పోయిన ఐఎన్టీయూసీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆగిపోయిన తమ గడియారాన్ని నడిపే ప్రయత్నం చేస్తున్నా రని వారు విమర్శించారు. ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి ఎం.సంపత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీనివాస్, గౌతం గోవర్ధన్, బోగ సతీష్ బాబు, దొంత సాయన్న, ఎం.చక్రపాణి, సిద్దమల్ల రాజు, కన్నం లక్ష్మీనారాయణ, చెప్యాల భాస్కర్, గొడిసెల నరేష్, ఆరెల్లి రాజేశ్వరరావు, బుర్ర భాస్కర్, పడాల కనకరాజ్, ఎర్రగొల్ల చేరాలు, బూడిద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. గేట్ మీటింగ్‌ల అనంతరం జీడికే11 వ ఇంక్లైన్‌కు చెందిన మైనింగ్ స్టాఫ్, టెక్నికల్ స్టాఫ్, బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్ కార్మికులు దాదాపు 150 మంది వివిధ సంఘాల నుంచి ఏఐటీయూసీ చేరగా వారికి సీతారామయ్య కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

సఖీ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
సఖీ సెంటర్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి మండల కేంద్రం రంగంపల్లిలో గల రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూల్ ఆవరణలో నిర్మిస్తున్న సఖీ సెంటర్ భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు.మహిళలపై జరుగుతున్న హింసను నిరోధించేందుకు, బాధిత మహిళలకు అండగా ఉండేందుకు ఉపయోగపడే సఖీ వన్ స్టాప్ సెంటర్ భవనం చుట్టూ ఆవరణ ఆహ్లాదకరంగా ఉండాలని, ప్లాన్‌ను పరిశీలించి భవనం పరిసరాలలో ఏర్పాటు చేయవలసిన కాంపౌండ్ వాల్, కిచెన్ రూమ్, భద్రత పరంగా కిటికీలకు గ్రిల్స్, గేట్, డ్రైనేజీ ఏర్పాట్లు, టాయిలెట్స్, మహిళలకు ఆహ్లాదకరంగా అనిపించే పెయింటింగ్స్ గోడలపై ఏర్పాటు చేయాలని తెలిపారు.భవనం వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో ఓపెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు, పూల మొక్కలు పెంచడం, తదితర కార్యక్రమాలు చేపించి ప్రశాంత వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, పీఆర్-డి. ఈ. శంకరయ్య, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ స్వప్న, పెద్దపల్లి సీడీపీవో కవిత, సూపర్వైజర్ ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్

కార్మికులకు ఏం హక్కులు కల్పించారని
జాతీయ సంఘాలకు ఓటు వేయాలి

జాతీయ కార్మిక సంఘాలకు ఐలి శ్రీనివాస్ సూటి ప్రశ్న



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐలి శ్రీనివాస్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:
కార్మికులకు ఏం హక్కులు కల్పించారని జాతీయ సంఘాలకు ఓటు వేయాలని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం శావెల్,డ్రిల్ సెక్షన్ నందు పిట్ సెక్రెటరీ అటుకుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సింగరేణి కార్మిక వర్గానికి ఎన్నో హక్కులను సాధించిందని ఒక్క ఆందోళన కార్యక్రమం నిర్వహించకుండా 60కి పైగా హక్కులను తీసుక వచ్చిన ఘనత టీబీజీకేఎస్‌కి మాత్రమే ఉందని అన్నారు. కారుణ్య నియామకాలు, ఎక్స్టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 19000 పైచిలుకు ఉద్యోగాలు సింగరేణిలో ఇచ్చినామని 190 నిండిన బదిలీ వర్కర్లను సంవత్సరంలోపే పర్మనెంట్ చేయించిన చరిత్ర మాకే దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ చంద్రమౌళి, సేఫ్టీ కమిటీ మెంబర్ దాసరి శ్రీనివాస్, రాజమౌళి, క్యాంటీన్ కమిటీ మెంబర్ నరసింహులు, కొప్పుల శ్రీనాథ్, ననువాల రాకేష్ కుమార్, బొడ్డు రమేష్, ప్రవీణ్, ఉదయ్, కోట శ్రీనివాస్,మంత్రి రవీందర్, సదయ్య, ఆకుల కిషోర్,కందుల కుమారస్వామి, లింగారెడ్డి, తోట కొమరయ్య మల్లికార్జున్, రామ్ కుమార్, రాజేశం, రాములు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే విజయరమణారావు



ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలందిస్తానని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం, భూపతిపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా భూపతి పూర్ గ్రామానికి విచ్చేసిన సందర్భంగా విజయ రమణారావుకు నాయకులు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి వేద మంత్రాలతో విజయరమణరావును ఆశీర్వదించారు. అనంతరం విజయ రమణారావు మాట్లాడు తూ ఆలయ అభివృద్ధి అన్ని విధాల సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, జడ్పీటీసీ మినుపాల స్వరూప రాణి ప్రకాష్ రావు, గ్రామ సర్పంచ్ జమున తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పన్నాల రాములు, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దామోదర్ రావు, గర్రెపెల్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ జానీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ రావు, పులి వెంకటేశం,వెంకన్న పటేల్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన వంతెన సైడ్ వాల్

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ ఓదెల:
ఓదెల మండలంలోని గుంపుల మానేరువాగు పై నిర్మించిన వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో మే 25వ తేదీన హైజాక్స్ మిషన్‌తో పాటు మానేరులో పడి డ్రైవర్ మృతి చెందాడు. ఆ ఘటనలో వంతెన సైడ్ వాల్ కూలిపోయింది. కూలిన వంతెన సైడ్ వాల్ ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగి నెలలు గడుస్తున్నా వంతెన సైడ్ వాల్ మరమ్మత్తు చేయకపోవడం, కనీస ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి త్వరగా మరమ్మత్తులు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన వంతెన సైడ్ వాల్

ఐఎన్‌టీయూసీలో చేరిన టీబీజీకేఎస్ నాయకుడు

నవతెలంగాణ-గోదావరిఖని:
టీబీజీకేఎస్ సీనియర్ నాయకులు బేబీ శ్రీనుకు ఐఎన్‌టీయూసీ యూనియన్‌లో చేరారు. మంగళ వారం గోదావ రిఖనిలోని జనక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమం సందర్భంగా ఆయన ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ సమక్షంలో యూనియన్ చేరారు. ఈ సందర్భంగా ఆయనకు జనక్ ప్రసాద్ యూనియన్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీ యూసీ గెలుపు కోసం తన సాయశక్తుల పని చేస్తానని ఈ సందర్భంగా బేబీ శ్రీను అన్నారు. కార్యక్రమంలో ఎస్.నర్సింహారెడ్డి, ధర్మపురి, కచ్చకాయల సదానందం, రాజేందర్ తదితరులున్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న జనక్ ప్రసాద్

ఐఎన్‌టీయూసీ సెంట్రల్ పార మెడికల్ స్టాఫ్ ఇన్‌చార్జీగా కుసుమ కుమారి



నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న జనక్ ప్రసాద్

నవతెలంగాణ-గోదావరిఖని:
ఐఎన్‌టీయూసీసెంట్రల్ పార మెడికల్ స్టాఫ్ ఇన్‌చార్జీగా కుసుమ కుమారి నియమితుల య్యారు. ఈ మేరకు సింగరేణి ఆర్జీ-1లోని జనక్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ సమక్షంలో కాంగ్రెస్ నాయకులు మాదరబోయిన రవి కుమార్ ఆధ్వర్యంలో కుసుమ కుమారి ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు జనక్ ప్రసాద్ కండువా కప్పి, సెంట్రల్ పార మెడికల్ స్టాఫ్ ఇన్‌ఛార్జీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌లు నరసింహ రెడ్డి, ధర్మపురి, ఆర్జీ-1 ఉపాధ్య క్షుడు సదానందం, జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి దాస్, సురంజన్ తదితరులున్నారు.